# లక్షలు వెచ్చించి లక్ష్యం మరిచారు

- 15 ఏండ్లుగా నిరుపయోగంగా మినీ స్టేడియం
- తలుపులు కిటికీలు మాయం
- అసాంఘిక కార్యకళాపాలకు అడ్డాగా మారిన వైనం
- అధికారుల నిర్లక్ష్యంతో లక్షలాది రూపాల ప్రజాధనం వృథా
- వినియోగం లోకి తేవాలని స్థానికుల వినతి




నిర్వహణ లేక నిరుపయోగంగా మారిన మినీస్టేడియం



స్టేడియంలో పెరిగిన తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు

కందుకూరు ఆగస్టు 23 : ముందు చూపు లేని అధికారుల నిర్ణయాలు, దానికి తోడు అభివృద్ధి పనుల వైపు కన్నెత్తి చూడకపోవడంతో లక్షలాధి రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరవుతున్నది. కందుకూరు మండల కేంద్రంలో దాదాపుగా రూ. 46లక్షలు వెచ్చించి మినీ స్టేడియం నిర్మించి 15 సంవత్సరాలు కావస్తున్నా క్రీడాకారులకు అందుబాటులోకి రాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. ఎంతో ఆశయంతో ఈ స్టేడియాన్ని నిర్మించారు. కానీ నిర్వహణ మరిచారు. అటు వైపు కన్నెత్తి చూసే నాథుడే లేక పోవడంతో కిటికీలు, తలుపులు, విద్యుత్ బోర్డులు ఆపహరణకు గురయ్యాయి. క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నిర్మించిన ఈ స్టేడియంలో నిత్యం మందు బాబులకు నిలయంగా మారిందిం. దీంతో ఏ గదిలో చూసినా ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. 2008వ సం వత్సరంలో నిర్మించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనంతరం అటు వైపు కన్నెత్తి చూడలేదు. స్టేడియం వినియోగంలో లేకపోవడంతో కనీసం ప్రతి సంవత్సరం నిర్వహించే క్రీడా పోటీలను కూడా ఇక్కడ నిర్వహించడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారిందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 1000 మంది క్రీడా కారులున్నా వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం స్టేడియంలో తుమ్మ చెట్లు దర్శన మిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని స్టేడియంలో కనీసం వసతులు కల్పించి అందుబాటులోకి తీసుకరావాలని స్థానికులు కోరుతున్నారు.

### వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి



మినీస్టేడియాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలి. గత ప్రభుత్వం నిర్మించిన స్టేడియంతో లక్షలాది రూ పాయలు దుర్వినియోగం అ య్యాయి. మండలంలో అనేక మంది క్రీడాకారులు ఉన్నా క్రీడా మైదానాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మినీ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకు వస్తే క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుంది.

– సురుసాని రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కందుకూరు

### రోడ్డు సౌకర్యం కల్పించాలి



స్టేడియానికి వెల్లడానికి రోడ్డు సౌకర్యం లేదు. వాచ్‌మెన్ లేడు. మందుబాబులకు అడ్డగా మారింది. అసాంఘిక కార్యకళాపాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం అధికారులు చొరవ తీసుకొని రోడ్డు వసతితో పాటు వాచ్‌మెన్‌ను నియమించి స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకరావాలి

–సాద మల్లారెడ్డి
సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ కార్యదర్శి

## పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

కందుకూరు, ఆగస్టు 23 : ప్రభుత్వ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి ఎండీ బషీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భోజన విరామ సమయంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. నేదునూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు 28 జీఓ గుదిబండగా మారిందని తెలిపారు. దీన్ని రద్దు చేసి నూతన పెన్షన్ విధానాన్ని తక్షణమే తొలగించాలని కోరారు. దీని వల్ల వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ శర్మ, విజయ, మోహన్‌రెడ్డి, సురేశ్, గ్లోరీ, కౌసల్య, కరుణాకర్, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



నేదునూరు ప్రభుత్వ పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

## సీఎం ఆర్‌ఎఫ్ ఎల్ ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా

ఆర్కేపురం, ఆగస్టు 23 : మహేశ్వరం నియోజకవర్గం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ బాలాజీనగర్‌లో నివాసముండే శ్యామ్‌రావు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరగా అందుకుగాను రూ.5లక్షలు ఖర్చు అవుతుందని బాధితుడికి చెప్పారు. దీంతో శ్యామ్‌రావు కాంగ్రెస్ నాయకుడు బేర బాలకిషన్‌ను సంప్రదించడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లడంతో శ్యామ్‌రావుకు సీఎం ఆర్ఎఫ్ నుంచి రూ.2,50,000 మంజూరు చేయించిన ఎల్‌ఓసీని శుక్రవారం అందజేశారు.

## పేద జంటకు వివాహం



సైదాబాద్‌లోని ఆర్య ఈవెంట్స్‌లో రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద జంటకు శుక్రవారం వైభవంగా వివాహం జరిపించారు. మానస, నర్సింహ వివాహానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై ఆశీర్వదించారు. ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్‌కుమార్, అరుణ దంపతులు వధూవరులకు అవసరమైన వస్తువులను, సామగ్రిని అందజేశారు. అనిల్‌కుమార్ , అరుణ, రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ప్రతినిధి పెద్ది శంకర్, జగిని శ్రీనివాస్ పాలొన్నారు.

– సైదాబాద్, ఆగస్టు 23

## మూడుచింతలపల్లిలో నేడు రైతు సమావేశం

శామీర్‌పేట, ఆగస్టు 23 : మూడుచింతలపల్లి రైతు వేదికలో శనివారం ఉదయం 10 గంటలకు వరి, కూరగాయల సాగుపై రైతు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌పీవో చైర్మన్ వంగ పెంటారెడ్డి కోరారు. వరి పంట, కూరగాయ తోటలకు తెగుళ్లు, ఇతర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## చోరీలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్‌ఐ మారయ్యకు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేం, కాలనీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 23 : సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌ తం నగర్, న్యూ గడ్డిఅన్నారం కాలనీల్లో రాత్రి సమయాల్లో జరుగుతున్న చోరీలను, కాలనీ వీధుల్లో హాస్టల్‌కు చెందిన యువతీయువకుల న్యూసెన్స్‌ను అరికట్టాలని కోరుతూ గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమమహేశ్వర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి సరూర్‌నగర్ ఎస్‌ఐ మారయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గౌతం నగర్ కాలనీ అధ్యక్షుడు కళ్లెం మధుసూదన్‌రెడ్డి, న్యూ గడ్డిఅన్నారం అధ్యక్షుడు రఘుతో కలిసి కార్పొరేటర్ బద్దం ప్రేం మాట్లాడుతూ.. రాత్రి సమయాల్లో గత కొన్ని రోజులుగా కొందరు ద్విచక్ర వాహనాలపై వచ్చి వాటర్ సంపుపై ఉన్న మూతలను చోరీ చేస్తున్నారని, అంతేకాక పరిసరాల్లోని హాస్టళ్లకు చెందిన యువతీ యువకులు మందు బాటిళ్లతో వచ్చి న్యూ సెన్స్ చేస్తున్నారని, కాలనీవాసులకు రక్షణ కల్పించాలని కోరారు. స్పందించిన ఎస్‌ఐ మారయ్య పెట్రోలింగ్ పెంచి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## అంగన్‌వాడి కేంద్రాల తనిఖీ..

మాదన్నపేట, ఆగస్టు 23 : సైదాబాద్, కుర్మగూడ లోని అంగన్‌వాడి కేంద్రాలలో డిప్యూటీ తాసీల్దార్ కవిత అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యం విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. అధికారి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న డిప్యూటీ తాసీల్దార్ కవిత, అధికారి ప్రదీప్






## గణేశ్ ఉత్సవాలను ప్రశాతంగా జరుపుకోవాలి





సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ పాటిల్

సైదాబాద్/ మాదన్నపేట, ఆగస్టు 23 : గణేశ్ ఉత్సవాలను ప్రశాతంగా జరుపుకోవాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ అన్నారు. శుక్రవారం విద్యుత్, జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశ్ ఉత్సవాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇబ్బందులు వస్తే ఆయా శాఖల అధికారలుతో సమన్వయం చేసికొని పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ స్వామి, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్న, సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, సీఐ రాఘువేంద్ర పాల్గొన్నారు.

**ఐఎస్ సదన్‌లో..**

గణపతి నవరాత్రులను సంతోషంగా జరుపుకోవాలని ఐఎస్ సదన్ సీఐ వెంకటరామయ్య ప్రజలను కోరారు. శుక్రవారం ఆయన గణపతి మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు స్థానికులకు ఇబ్బందులు కలుగకుండా నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఐ సైదులు, ఎస్‌ఐలు , మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



గణేశ్ ఉత్సవాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ

## అల్పాహారం పంపిణీ..



రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంద రోజులు వంద మందికి నిత్యం అల్పాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన కార్యక్రమం శుక్రవారం 14వ రోజు ఎల్బీనగర్‌లో ఆపన్నులకు అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శంకర్, యూత్ కమిటీ అధ్యక్షుడు శివనేత ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి నందికొండ గీతారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు అల్పాహారాన్ని వడ్డించారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రవీణ్, అఖిల్, శ్రీను, వెంకటేశ్, శ్రీనాథ్, సాయి పాల్గొన్నారు.

– ఎల్బీనగర్,ఆగస్టు 23

## యువతి అదృశ్యం

జవహర్‌నగర్, ఆగస్టు 23: కళాశాల నుంచి ఇంటికి వచ్చిన యువతి అదృశ్యమైంది. జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపిన ప్రకారం.. యాప్రాల్‌లో ఉండే అరవిందన్ కూతురు స్రవంతి(17) మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. గురువారం కళాశాలకు వెళ్లిన స్రవంతి సాయంత్రం ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తండ్రికి ఫోన్ చేయగా.. ఇంటి వద్దనే ఉండమని కూతురికి చెప్పాడు. తండ్రి ఇంటికి వచ్చి చూడగా కూతురు కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి అరవిందన్ శుక్రవారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు



అష్టలక్ష్మి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకణలో అష్టలక్ష్మి అమ్మవారు

మన్సూరాబాద్/ ఆర్కేపురం, ఆగస్టు 23 : శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని నాగోల్ డివిజన్ పరిధి శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి దేవాలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల ఫలాలతో అలంకరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్, కమిటీ సభ్యులు యాదగిరి, హన్మంతరావు, రవి, మురళి, రమణమూర్తి, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ గణేశ్‌యాదవ్

ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 5:30 లకు ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామికి అభిషేకం, అలంకణ, అష్టలక్ష్ములకు లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు శ్రీ లక్ష్మీనారాయణస్వామి కల్యాణమహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలి

మన్సూరాబాద్, ఆగస్టు 23: నాగోల్ శ్మశానవాటికలో ఒక సామాజిక వర్గానికి చెందిన పూర్వీకుల సమాధులను ధ్వంసం చేస్తున్నారని తెలంగాణ రజక చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ తదితర సంఘం ప్రతినిధులు ఇటీవల జోనల్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యకు ఫిర్యాదులు చేశారు. శుక్రవారం నాగోల్ శ్మశానవాటికను ఆయన సందర్శించి సమస్యను పరిశీలించారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చే ప్రజల కోసం శ్మశానవాటికలో ఉన్న ఖాళీ స్థలాల్లోనే అభివృద్ధి పనులను నిర్వహించాలని సూచించారు. పనుల పేరుతో ఎవరికీ ఇబ్బందులు కలిగించొద్దని ఇంజినీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ అధికారులకు డిప్యూటీ కమిషనర్ సూచించారు.



నాగోల్ శ్మశానవాటికలోని సమస్యలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, అధికారులు

## ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం

బడంగ్‌పేట, ఆగస్టు 23 : మహేశ్వరం నియోజక వర్గంలో గతంలో ఎల్ఆర్ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి క్రమ బద్ధీకరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో బడంగ్‌పట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 47,789 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించడానికి 4టీములను ఏర్పాటు చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 3,412 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దరఖాస్తులను పరిశీలించడానికి 3టీములను ఏర్పాటు చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో 10,892 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిశీలించడానికి 3 టీములను ఏర్పాటు చేశారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో 2,541 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులను పరిశీలించడానికి 2 టీమ్‌లను ఏర్పాటు చేశారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు అందరు కలిసి సమన్వయంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి క్రమ బద్ధీకరణ చేయాలని ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయడానికి అధికారులు వేగం పెంచారు.



బడంగ్‌పట పరిధిలో ఎల్ఆర్ఎస్ స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు

## 28 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

శామీర్‌పేట, ఆగస్టు 23 : 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌జీఎఫ్ శామీర్‌పేట జోనల్ కార్యదర్శి సత్తిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శామీర్‌పేట జోనల్ స్థాయి టోర్నమెంట్, సెలక్షన్స్ సంద ర్భంగా శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల విద్యార్థులకు ఈనెల 28 నుంచి 30 వరకు మజీద్‌పూర్‌లోని జైన్ హెరిటేజ్ కేంబ్రిడ్జ్ స్కూల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు 28న వాలీబాల్, 29న ఖోఖో, 30న కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అండర్–14 విభాగంలో పాల్గొనే బాలబాలికలు 1 జనవరి 2011 తర్వాత జన్మించిన వారై ఉండాలని, అండర్–17 విభాగంలో 1 జనవరి 2008 తర్వాత జన్మించిన వారై 6 నుంచి 10వ తరగతి చదువుతుండాలని తెలిపారు. ఒక వయసు కేటగిరీలో ఆడిన వారు ఇంకో కేటగిరిలో ఆడకూడదని, విద్యార్థులు వారి స్కూల్ బోనఫైడ్, ఆధార్ కార్డులు తప్పనిసరిగా తీసుకోని ఈనెల 27 ఉదయం 10 గంటల లోపు జడ్పీహెచ్‌ఎస్ తూంకుంటలో సంప్రదించాలని తెలిపారు. అదే రోజు ఉదయం 11 గంటలకు డ్రా తీస్తామన్నారు. పూర్తి వివరాలకు 9490148731, 9246190425 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఎంసీఏ రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) కోర్సుతో పాటు దూరవిద్య ద్వారా అందించే ఎంసీఏ కోర్సు పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను వి డుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను www. osmania. ac.inలో అం దుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 23: ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. కోర్సు నాలుగో సెమిస్టర్ మెయిన్, మూడో సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.